# అల్లాహ్ తఆలాను నమ్ముకొనుట గురించి

# మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవితం ఆధారంగా గొప్ప ఆదర్శం

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 04.09.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

అల్లాహ్ తఆలా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను సంపూర్ణ మానవుడిగా చేసి, మానవాళి అందరికీ ఒక ఉత్తమమైన ఆదర్శంగా నిలిపాడు. ప్రతి సద్గుణాన్ని ఆయన వ్యక్తిత్వంలో ప్రసాదించి, దానిని ఉత్తమ ప్రవర్తనగా తీర్చిదిద్దాడు. విశ్వాసులు తమలో మంచి గుణాలను పెంచుకోవాలన్నా, ఉన్నత నైతిక ప్రమాణాలను సాధించాలన్నా ఈ మహా ప్రవక్తను అనుసరించాలని నొక్కిచెప్పాడు, ఎందుకంటే అల్లాహ్ తఆలా ప్రసన్నతను పొందేందుకు ఇదే ఏకైక మార్గం. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతి గుణాన్ని అత్యున్నత స్థాయికి చేర్చడమే కాకుండా, విశ్వాసులు కూడా ఆ ఉన్నత ప్రమాణాలను సాధించడానికి కృషి చేయాలని ఉపదేశించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రలో అల్లాహ్ తఆలాపై నమ్మకం ఉంచడం అనే గుణం చాలా స్పష్టంగా కనిపిస్తుంది.

అల్లాహ్ తఆలా ఈ విధంగా ఉపదేశిస్తున్నాడు: ఓ ప్రవక్తా! మేము నిన్ను లోకానికి పర్యవేక్షకుడిగా, విశ్వాసులకు శుభవార్త అందించేవాడిగా, అవిశ్వాసులను హెచ్చరించేవాడిగా, అల్లాహ్ ఆజ్ఞతో అతని వైపునకు పిలిచేవాడిగా, ఒక ప్రకాశించే సూర్యుడిగా పంపాము. విశ్వాసులకు అల్లాహ్ వైపు నుండి గొప్ప అనుగ్రహం ఉందనే శుభవార్తను అందించు. అవిశ్వాసులు, కపటుల మాటలను వినకు, వారి వేధింపులను పట్టించుకోకు మరియు అల్లాహ్‌పైనే నమ్మకం ఉంచు, కార్యాచరణకు అల్లాహ్ సరిపోతాడు. ఇందులో విశ్వాసులకు కూడా ఒక శుభవార్త ఉంది: వారు విశ్వాసంపై స్థిరంగా ఉండి, అల్లాహ్ ఆజ్ఞలను పాటిస్తూ, అతనిపై సంపూర్ణ నమ్మకం ఉంచితే, అల్లాహ్ తఆలా వారి ప్రతి కష్టంలోనూ వారికి తోడుగా ఉంటాడు. మరొక చోట ఈ విధంగా చెప్పబడింది: అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు, మరియు విశ్వాసులు అల్లాహ్‌పైనే తమ నమ్మకాన్ని ఉంచుకోవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఈ విధంగా ఉపదేశిస్తున్నారు: హజ్రత్ ఖాతముల్ అంబియా సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత సంఘటనలను పరిశీలిస్తే ఒక విషయం అత్యంత స్పష్టమవుతుంది. దైవ ప్రవక్త (స) అత్యున్నత స్థాయి నిష్కల్మషత, పరిశుద్ధాంతఃకరణ కలిగినవారని, దేవుని కోసం ప్రాణాలర్పించే త్యాగశీలి అని, సృష్టి యొక్క భయం మరియు ఆశల నుండి పూర్తిగా ముఖం తిప్పుకుని కేవలం దేవునిపైనే ఆధారపడినవారని బోధపడుతుంది. ప్రవక్తల జీవిత చరిత్రలలో ఇటువంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు దేవునిపైనే ఆధారపడుతూ అంతటి స్థిరత్వాన్ని, పట్టుదలను చూపించిన ఉదాహరణ మరొకటి కనిపించదు.

మరలా వారు ఈ విధంగా ఉపదేశిస్తున్నారు: తబత్తుల్, అంటే దేవునితో హృదయపూర్వక బంధాన్ని ఏర్పరచుకోవడం మరియు ఐహిక ప్రపంచాన్ని వదిలిపెట్టడం అనే గుణానికి మన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారే ప్రత్యక్ష ఆదర్శం. ఆయనకు ఎవరి పొగడ్తలతోనూ పనిలేదు, అలాగే ఎవరి నిందలతోనూ విచారము లేదు. ఆయనకు లెక్కలేనన్ని కష్టాలు ఎదురైనప్పటికీ, దేవుని నుండి ఏ పని కోసమైతే వచ్చారో ఆ పనిని ఆపడానికి

ఏ లాభం లేదా అత్యాశ కూడా ఆయనను అడ్డుకోలేకపోయాయి. ఎవడైతే 'ముతబత్తిల్' (దేవునికే అంకితమైనవాడు) అవుతాడో, అతడు 'ముతవక్కిల్' (దేవునిపై నమ్మకముంచేవాడు) కూడా అవుతాడు. అంటే ముతవక్కిల్ కావడానికి ముతబత్తిల్ కావడం ఒక అనివార్య నియమం. మనిషి ఇతరులపై ఆధారపడి నమ్ముకున్నంత కాలం, అల్లాహ్‌పై సంపూర్ణంగా విశ్వాసం ఉంచడం సాధ్యం కాదు. మనిషి దేవుని వైపునకు మళ్లినప్పుడు, ప్రపంచం నుండి సంబంధాలు తెంచుకుని దేవునితో బంధాన్ని బలపరుచుకుంటాడు. మన పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పరిపూర్ణ ముతబత్తిల్ మరియు పరిపూర్ణ ముతవక్కిల్‌గా నిలిచారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలామ్ ఇంకా ఈ విధంగా ప్రవచిస్తున్నారు: అల్లాహ్ తఆలా బలహీనుడని అనుకోవద్దు, ఆయన అపారమైన శక్తి కలిగినవాడు. ఏదైనా విషయంలో మీరు అతనిపై ఆధారపడినప్పుడు, అతడు ఖచ్చితంగా మీకు సహాయం చేస్తాడు. ఎవరైతే అల్లాహ్‌పై నమ్మకముంచుతారో, వారికి అల్లాహ్ మాత్రమే సరిపోతాడు. దైవభీతి శుభఫలితాలలో ఒకటి ఏమిటంటే, ధార్మిక వ్యవహారాలకు ఆటంకం కలిగించే కష్టాల నుండి దైవభీతి కలిగినవారిని అల్లాహ్ తఆలా విముక్తుడిని చేస్తాడు. అదేవిధంగా, అల్లాహ్ తఆలా దైవభీతి పరుడికి ప్రత్యేకమైన మార్గంలో జీవనోపాధిని ప్రసాదిస్తాడు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అక్షరాస్యుడైనప్పటికీ గ్రంథజనులు, తత్వవేత్తలు, అత్యున్నత పాండిత్యం, విజ్ఞానం కలిగిన పండితులతో సహా ప్రపంచం మొత్తాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. కానీ ఆయనకు ఆ ఆధ్యాత్మిక జ్ఞానం (ఆధ్యాత్మిక రిజ్క్) ఎంతగా లభించిందంటే, ఆయన అందరిపై పైచేయి సాధించి వారి తప్పులను నిరూపించారు.

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విధంగా ఆదేశించారు: మీరు అల్లాహ్‌పై ఉంచాల్సిన రీతిలో నిజమైన నమ్మకం ఉంచితే, పక్షులకు జీవనోపాధి ప్రసాదించినట్లే మీకు కూడా ఖచ్చితంగా ప్రసాదించబడుతుంది. అవి ఉదయం పూట ఖాళీ కడుపుతో బయలుదేరి, సాయంత్రానికి పొట్ట నింపుకుని తిరిగి వస్తాయి. హజ్రత్ అబూ జర్ (రజి) నుండి ఉల్లేఖించబడింది. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విధంగా ఆదేశించారు: ఐహిక ప్రపంచం పట్ల విరక్తి అంటే హలాల్‌ను హరామ్ చేసుకోవడం కాదు, లేదా సంపదను వృథా చేసుకోవడం కాదు. ప్రపంచం పట్ల విరక్తి అంటే మీ రెండు చేతుల్లో ఉన్నదాని కంటే అల్లాహ్ చేతిలో ఉన్నదానిపైనే మీకు ఎక్కువ నమ్మకం ఉండటం.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం రోజువారీ వ్యవహారాలలో కూడా అల్లాహ్ తఆలాపై నమ్మకాన్ని ఉంచుతూ దుఆలు చేసేవారు. హజ్రత్ ఉమ్మె సల్మా (రజి) ఇట్లు ఉల్లేఖించారు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ ఇంటి నుండి బయటకు వెళ్లేటప్పుడు ఈ విధంగా ప్రార్థించేవారు: అల్లాహ్ నామంతో, నేను అల్లాహ్‌పైనే ఆధారపడ్డాను. ఓ అల్లాహ్! మేము అడుగుజారడం నుండి లేదా దారి తప్పడం నుండి, మేము ఎవరిపైనా అన్యాయం చేయడం నుండి లేదా మాపై అన్యాయం జరగడం నుండి, మేము అజ్ఞానంతో ప్రవర్తించడం నుండి లేదా మా పట్ల అజ్ఞానంతో ప్రవర్తించబడటం నుండి నీ శరణు వేడుకుంటున్నాము. హజ్రత్ బురైదా (రజి) ఇట్లు ఉల్లేఖించారు; పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంటి నుండి బయటకు వచ్చినప్పుడు ఈ విధంగా ప్రార్థించేవారు: అల్లాహ్ నామంతో, నేను అల్లాహ్‌పైనే నమ్మకముంచాను. అల్లాహ్ తోడ్పాటు ద్వారానే మంచి చేసే శక్తి, చెడు నుండి రక్షించబడే బలం లభిస్తాయి. ఓ అల్లాహ్! నేను మార్గం తప్పడం నుండి లేదా నన్ను మార్గం తప్పించడం నుండి, నేను పొరపాటు చేయడం నుండి లేదా నన్ను పొరపాటులో పడేయడం నుండి, నేను ఎవరిపైనా అన్యాయం చేయడం నుండి లేదా మాపై అన్యాయం జరగడం నుండి, నేను అజ్ఞానానికి ఒడిగట్టడం నుండి లేదా నా పట్ల అజ్ఞానంగా ప్రవర్తించబడటం నుండి మరియు నేను ఎవరికైనా హాని తలపెట్టడం నుండి లేదా నాకు హాని తలపెట్టబడటం నుండి నీ శరణు వేడుకుంటున్నాను.

హజ్రత్ అబూ హురైరా (రజి) నుండి ఇట్లు ఉల్లేఖించబడింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ బిలాల్ (రజి) వద్దకు వెళ్లారు. అక్కడ ఖర్జూరాల కుప్పను చూసి: ఓ బిలాల్! ఇది ఏమిటి? అని అడిగారు. దానికి హజ్రత్ బిలాల్ (రజి) ఇవి మీ కోసమని దాచి ఉంచిన కొన్ని ఖర్జూరాలు అని విన్నవించుకున్నారు. అప్పుడు

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఓ బిలాల్! పునరుత్థాన దినాన ఇవి నరకంలో పొగలా లేస్తాయని నీవు భయపడటం లేదా? ఓ బిలాల్! ఖర్చు చేయి, ఆ సృష్టికర్త అయిన అల్లాహ్ వైపు నుండి పేదరికం వస్తుందేమోనని భయపడకు అని సెలవిచ్చారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఈ విధంగా ఉపదేశిస్తున్నారు: అల్లాహ్ తఆలా చెప్పిన మార్గంలో నడుస్తూ, అతనిపై నమ్మకాన్ని స్థిరంగా ఉంచుకున్నప్పుడే మనిషి విశ్వాసంలో ప్రగతి సాధ్యమవుతుంది. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ బిలాల్‌తో రేపటి దేవునిపై నీకు విశ్వాసం లేదా? ఈరోజు నీకు ప్రసాదిస్తున్న దేవుడు రేపు ఇవ్వడా? అని అన్నారు. అయితే ఈ ఉపదేశం అర్థం వృథా ఖర్చులు చేయడమని కానీ, లేదా తగిన సాధన సంపత్తులను సమకూర్చుకోకూడదని కానీ కాదు. సాధనాలను ఉపయోగిస్తూనే అల్లాహ్ తఆలాపై పరిపూర్ణ నమ్మకం ఉంచడం అత్యవసరం. జాగ్రత్తలు తీసుకోకపోవడం లేదా సాధనాలను ఉపయోగించకపోవడం 'తవక్కుల్' అనిపించుకోదు.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. ఒక వ్యక్తి ఓ దైవ ప్రవక్తా! నేను ఒంటె మోకాలును తాడుతో బంధించి అల్లాహ్‌పై ఆధారపడమంటారా, లేదా దాన్ని విడిచిపెట్టి ఆధారపడమంటారా? అని విన్నవించుకున్నాడు. దానికి ప్రవక్త (స) దాని మోకాలును బంధించు, ఆపై (అల్లాహ్‌పై) ఆధారపడు అని అన్నారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలామ్ ఈ విధంగా ఉపదేశిస్తున్నారు: దేవునిపై ఆధారపడటం అంటే మనిషి ప్రణాళికలు లేదా ప్రయత్నాలను వదిలిపెట్టడం కాదు. తగిన ప్రయత్నాలన్నీ పూర్తి చేసి, ఆ తర్వాత ఫలితాన్ని దేవునికి వదిలిపెట్టడమే తవక్కుల్. ఒకవేళ మనిషి ఏ ప్రయత్నమూ చేయకుండా కేవలం నమ్మకం మాత్రమే ఉంచితే ఆ నమ్మకం వ్యర్థమైనది. అలాగే కేవలం ప్రయత్నాలే చేసి వాటిపైనే ఆధారపడుతూ దేవునిపై నమ్మకం ఉంచకపోతే ఆ ప్రయత్నం కూడా నిరర్థకమైనదే.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఈ విధంగా ఉపదేశిస్తున్నారు: దేవునిపై ఆధారపడటం అంటే మనిషి ప్రణాళికలు లేదా ప్రయత్నాలను వదిలిపెట్టడం కాదు. తగిన ప్రయత్నాలన్నీ పూర్తి చేసి, ఆ తర్వాత ఫలితాన్ని దేవునికి వదిలిపెట్టడమే తవక్కుల్. ఒకవేళ మనిషి ఏ ప్రయత్నమూ చేయకుండా కేవలం నమ్మకం మాత్రమే ఉంచితే ఆ నమ్మకం వ్యర్థమైనది. అలాగే కేవలం ప్రయత్నాలే చేసి వాటిపైనే ఆధారపడుతూ దేవునిపై నమ్మకం ఉంచకపోతే ఆ ప్రయత్నం కూడా నిరర్థకమైనదే.

హజ్రత్ ఆయిషా (రజి) ఇట్లు ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు కొన్ని దీనారాలు వచ్చాయి. దైవ ప్రవక్త (స) వాటిలో దాదాపు అన్నింటినీ పంచేశారు, కేవలం ఆరు దీనారాలు మాత్రమే మిగిలిపోగా వాటిని తమ పవిత్ర సతీమణులలో ఒకరి వద్ద ఉంచారు. తమ చివరి అనారోగ్య సమయంలో దైవ ప్రవక్త (స) ఆ దీనారాల గురించి విచారించారు. అవి ఇంకా ఖర్చు కాలేదని తెలిసినప్పుడు ఆ దీనారాలను తెప్పించారు. మహా ప్రవక్త (స) వాటిని తన అరచేతిలో ఉంచుకుని లెక్కించగా అవి ఆరు దీనారాలు ఉన్నాయి. అప్పుడు ఆయన దేవునితో సమావేశమయ్యే సమయాన, ఈ ప్రపంచం నుండి వీడ్కోలు పొందే సమయాన ఇవి ముహమ్మద్ (స) వద్ద ఉంటే, ఆయనకు తన ప్రభువుపై ఉన్న నమ్మకం ఎలాంటిదవుతుంది? అని చెప్పారు. ఆ తర్వాత దైవ ప్రవక్త (స) ఆ దీనారాలన్నింటినీ అల్లాహ్ తఆలా మార్గంలో దానం చేశారు. అదే రోజున ఆయన పరమపదించారు. అల్లాహ్ తఆలా ఈ విధంగా ఉపదేశిస్తున్నాడు: అల్లాహ్ మన కోసం రాసి ఉంచినది తప్ప మనకు వేరే ఏదీ సంభవించదు. ఆయనే మన కార్యసాధకుడు, మరియు విశ్వాసులు అల్లాహ్‌పైనే తమ నమ్మకాన్ని ఉంచవలెను.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శంలో తవక్కుల్‌కు సంబంధించిన ఒక గొప్ప ఉదాహరణ ముసైలిమా కజ్జాబ్ సంఘటనలోనూ కనిపిస్తుంది. ముసైలిమా కజ్జాబ్ దైవ ప్రవక్త (స) కాలంలో వచ్చి ఒకవేళ ముహమ్మద్ (స) తన తర్వాత నన్ను తన వారసుడిగా ప్రకటిస్తే నేను ఆయనను అనుసరిస్తానని చెప్పాడు. అతడు మదీనాకు తన తెగకు చెందిన ఒక పెద్ద సమూహంతో వచ్చాడు. దైవ ప్రవక్త (స) అతని వద్దకు వెళ్లారు, ఆ సమయంలో హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ బిన్ శమ్మాస్ (రజి) కూడా ఆయనతో ఉన్నారు. ప్రవక్త గారి చేతిలో ఖర్జూర

కొమ్మ ముక్క ఒకటి ఉంది. దైవ ప్రవక్త (స) ముసైలిమా ముందు నిలబడి: నీవు నన్ను ఈ చిన్న కొమ్మ ముక్కను అడిగినా నేను నీకు ఇవ్వను. దేవుడు నీ కోసం ఏది నిర్ణయించాడో దానికి మించి నీవు ఏమీ సాధించలేవు. నీవు వెన్నుచూపి వెళ్లిపోతే అల్లాహ్ తఆలా నిన్ను నాశనం చేస్తాడని స్పష్టంగా చెప్పారు.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఈ విషయమై ఈ విధంగా ప్రవచిస్తున్నారు: పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఏ పనిలోనూ లౌకిక ప్రపంచంపైగానీ, ఐహిక విషయాలపైగానీ దృష్టి ఉండేది కాదు. ఆయన లౌకిక సాధనాల వైపు కనీసం కన్నెత్తి కూడా చూసేవారు కారు. బదులుగా ప్రతి పనిలోనూ ఆయన దృష్టి అల్లాహ్ తఆలా వైపునకే నిలిచి ఉండేది, అతడే సమస్తమూ చేస్తాడనే నమ్మకం ఆయనకు ఉండేది. ఆయన దైవవిశ్వాసానికి ఒక పరిపూర్ణమైన ఆదర్శం. మహా ప్రవక్త (స) జీవితకాలంలో ముసైలిమా ఒక పెద్ద సైన్యంతో మదీనాకు వచ్చి, తనను గనుక దైవ ప్రవక్త (స) తర్వాత ఖలీఫాగా ప్రకటిస్తే, తన సమూహంతో సహా ఆయనను అనుసరిస్తానని విన్నవించుకున్నాడు. కానీ పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ అభ్యర్థనను తక్షణమే తిరస్కరించారు.

ఆ సమయంలో అవిశ్వాసుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది, దైవ ప్రవక్త (స)నకు రకరకాల కష్టాలు కలిగించేవారు. కైసర్, కిస్రాల పాలకుల నుండి ఆదేశాలు వస్తూ ఉండేవి, బనీ గస్సాన్ తెగ యుద్ధానికి సిద్ధమవుతోంది మరియు అనేక ప్రభుత్వాలు ఈ నూతన ధార్మిక విప్లవాన్ని అనుమానాస్పదంగా చూస్తున్నాయి. ఇటువంటి క్లిష్ట సమయంలో మానవ మేధస్సు శత్రుమిత్రులందరినీ తనవైపు తిప్పుకోవాలని ఆలోచిస్తుంది. కానీ ప్రవక్త (స) గారి విశ్వాసం అల్లాహ్ తఆలాపైనే ఉండేది. ఆయన హృదయము నిశ్చలమైన నమ్మకంతో, హృదయము విశ్వాసంతో నిండి ఉండేది. ఆయన ముసైలిమాపై లేదా అతని సైన్యంపై ఆధారపడటాన్ని ఒక క్షణం కూడా సరైనదిగా భావించలేదు. కనీసం ఒక ఖర్జూర చిన్న కొమ్మ ఇచ్చి అయినా అతని మద్దతు పొందవలసి వస్తే, తాను దానివైపు కన్నెత్తి కూడా చూడనని స్పష్టంగా చెప్పారు.

ఈ సంఘటన ద్వారా బోధపడేదేమిటంటే, ప్రవక్త గారి ఆ తిరస్కరణ ఏ లౌకిక స్వార్థం కోసం కాక, అల్లాహ్ తఆలాపై ఆయనకున్న అపారమైన, పరిపూర్ణ నమ్మకం ఫలితమే. ఆయన తన తర్వాత స్వంత సంతానాన్ని వారసులుగా నియమించలేదు, బదులుగా హజ్రత్ అబూబకర్ (రజి) ఖిలాఫత్‌ను సూచించారు. దైవ ప్రవక్త (స) తలుచుకుంటే మదీనాలోనే తమ ఆధీనంలో ఉన్న ముసైలమాను బంధించి చంపించి ఉండేవారు, కానీ ఈ విషయంలో కూడా ఆయన అల్లాహ్ తఆలాపైనే ఆధారపడ్డారు, ఆ దేవుడే ఆ ఉపద్రవకారిని నాశనం చేస్తాడని విశ్వసించారు.

కనుక పవిత్ర ప్రవక్త (స) పవిత్ర జీవితం మనకు నమ్మకపు ఈ ఉత్తమ ఆదర్శాన్ని చూపిస్తుంది: అల్లాహ్ తఆలా వైపు సంపూర్ణంగా లొంగిపోవడం, అతని ప్రసన్నతకే అగ్రతాంబూలం ఇవ్వడం, లౌకిక వ్యతిరేకతలకు భయపడక పోవడం, తగిన సాధనాలను ఉపయోగిస్తూనే ఫలితాన్ని అల్లాహ్ తఆలాకే వదిలిపెట్టడం, ప్రతి పరిస్థితిలోనూ అతని సహాయంపై నమ్మకం ఉంచడమే నిజమైన నమ్మకం. అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వ బారిక్ వ సల్లిమ్.

ఖుత్బా జుమా ముగింపులో హుజూరె అన్వర్ అమరులైన మిర్జా సఫ్దర్ మహ్మూద్ గారు (మండీ బహావుద్దీన్), హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) వారి మనవరాలు అజీజా అమతుల్ అజీజ్ గారు మరియు సద్ర్ అంజుమన్ అహ్మదియ్యా పెన్షనర్ గౌ॥ రషీద్ అహ్మద్ అయాజ్ గారు ఈ ముగ్గురు దివంగతుల సద్గుణాలను ప్రస్తావించి వారి పరోక్ష అంత్యక్రియల ప్రార్థన చదివిస్తానని ప్రకటించారు.

اَلْحَمْدُلِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔